మబ్బులు పట్టాయి. పగలే పల్చని చీకటిగా వుంది. పదకొండు గంటల పొద్దు సమయాన్ని తెలియజేయలేక పోతుంది.

ఓ ముప్పై ఏళ్ళ వ్యక్తి; ముతక ఖద్దరు పైజమా, దానిపై చలువచేయని ఖద్దరు లాల్చీ ధరించాడు; ఓ సెంటీ మీటరు ఎత్తున గుబురుగా, నల్లగా పెరిగిన గడ్డం; చెంపల పట్టీలు, మీసాలూ, ఆ గడ్డంలో కల్సిపోయాయి. త్రికోణం రూపంలో వున్న ముక్కు; రోల్డ్ గోల్డ్ ఫ్రేం వెనుక స్పష్టంగా, పెద్దవిగా కనబడుతూన్న కళ్ళు; అరచేతి వెడల్పున వున్న నుదురు; దాని మధ్యన కుంకుడు గింజంత చందనం బోర్డరుతో కూడిన కుంకుమబొట్టు. లావుకు సరిపడా ఎత్తు; చదునైన భుజాలు; ఒక్కసారి చూస్తే జన్మలో మర్చిపోలేని విలక్షణమైన ఛైవులు; ఎదుటివారిని ఇట్టే ఆకట్టుకునే ముఖవర్చస్సు. చేతిలో చిన్న, నల్లటి బ్రీఫ్ కేసుంది. అతని పేరు గోవిందరావు.

# గీతా.... గోవిందరావు!

## తెళ్ళూరు నాగేశ్వర రావు

గోవిందరావు విజయవాడ సూర్యారావు పేటలో ఓ సాబా ఇంటి ముందు నిలబడి ఆ వేళప్పుడు బెల్ కొట్టాడు. రెండు నిమిషాల తర్వాత బరువుగా ఆ ఇంటి తలుపులు తెర్చుకున్నాయి. ఓ అరవై అయిదేళ్ళ వ్యక్తి ఆ తలుపులు తెర్చాడు.

"నమస్కారమండీ!... నా పేరు గోవిందరావు. మాది అసలు అమలాపురం. మా నాన్నగారు డిప్యూటీ తహశీల్దారు చేసి, రాజంపేటలో రిటైరై, ఎక్కడా సెటిల్ కాక, మూడేళ్ళక్రితం ఇహలోకయాత్ర సాగించారు. గీతలో శ్రీ కృష్ణపరమాత్మ చెప్పినట్టు: పుట్టిన ప్రతిజీవి మరణించక తప్పదు. మరణించిన వారికి మళ్ళీ జన్మ తప్పదు. జన్మించినవారికి కష్ట సుఖాలు, ప్రాపంచిక దుఃఖాలు తప్పవు. మానవునికి కర్మ సర్వస్వం. భగవంతుడు మన చుట్టూనే వుంటూ వుంటాడు. అయితే అలా వున్నట్టు మనకు తెలియదు. ఎందుచేతంటే ఆయనలో మనం వున్నాం గనక. మన ఆధ్యాత్మిక జీవన విధానానికి దారి చూపే దీపకళికే భగవద్గీత. భగవద్గీత ఏ ఇంట్లో లేకపోతే ఆ ఇంట్లో సుఖశాంతులు కరువైపోతాయని అఖిలేశ్వరీదేవి మూరేళ్ళ కిందటే చెప్పింది..." అంటూ హాల్లో ఫ్రేం కుర్చీలో కూర్చున్నాడు గోవిందరావు.

జడివాన కురిసి వెలిసినట్టయ్యింది.

అతని ఎదురూగ్గా కూర్చున్న యాభై అయిదేళ్ళ జయలక్ష్మీదేవి, ఆవిడ పక్కన నిలబడ్డ అన్న లక్ష్మీనారాయణా—ఇద్దరూ గోవిందరావు నిప్పులాంటి చొరవకు అచ్చెరువందారు.

బ్రీఫ్ కేస్‌లోంచి భగవద్గీత పుస్తకాన్ని బయటకు తీశాడు గోవిందరావు.

నల్లటి క్యాలికో బైండ్ మీద, సువర్ణాక్షరాలతో 'భగవద్గీత' అని వుంది. వ్యాఖ్యానించింది: అఖిలేశ్వరీదేవి. లోపల ఆరొందల పేజీల దాకా వుంది—రాయల్ ఆక్టోక్ సైజులో.

తెల్లటి పాల మీగడలాంటి స్వీడన్ పేపరుమీద ముద్రితం. 1956లో ప్రథమ ముద్రణ జరిగింది. దాని మీద వెల లేదు.

"మా ఆయన నారాయణ మూర్తిగారు సబ్ రిజిస్ట్రార్‌గా ఉండేటప్పుడు ఒకసారి నేను కల్సుకుని ఈ పుస్తకం విషయం చెప్పాను. తప్పకుండా తీసుకుంటా మన్నారు. వారు ఇటీవల హృద్రోగంతో పరమపదించి నట్టు తెల్సింది. తమ శేష జీవితానికి ఈ మహత్తర గ్రంథం ఎంతో ఉపయోగపడుతుందని నా ప్రగాఢ విశ్వాసం" అంటూ భగవద్గీతను జయలక్ష్మీదేవికి ఇచ్చాడు గోవిందరావు. ఆవిడ ఆ గ్రంథాన్ని అన్నయ్య కిచ్చింది. ఆ గ్రంథాన్ని లక్ష్మీనారాయణ చూస్తూండగా అన్నాడు గోవిందరావు.

"ఇది బహు అరుదైన ఉద్గ్రంథం. మార్కెట్లో లభించదు. దీన్ని ఇల్లా కొంతమందికే అమ్ముతూ భగవత్సేవ చేసుకుంటున్నాను. దీని ధర డెభ్బై అయిదు రూపాయిలు. ఆ సొమ్మును మీరు ఒక్క సారిగా చెల్లించనక్కర్లేదు. మూడు కిస్తీలుగా ఇవ్వొచ్చు. అడ్వాన్సుగా పాతిక రూపాయిలివ్వండి. వచ్చే నెల ఇదే తారీఖుకి మళ్ళీ మీ ఇంటికొస్తాను. మరో కిస్తీ పాతిక రూపాయిలు పుచ్చుకొని ఈ పుస్తకం ఇస్తాను. ఆ పైనెల వచ్చి మూడో కిస్తీ డబ్బు వసూలు చేసుకుంటాను. అంటే ఏమిటన్న మాట! రెండో వాయిదా చెల్లింపుకే ఈ అమూల్యమైన పుస్తకం మీ సొత్తు అయిపోతుంది. ఏమంటారు? మీకు ఒక్కసారే అంత డబ్బు చెల్లించాలనే బరువూ బాధ్యతా వుండదు. సులభమైన వాయిదా పద్దతుల్లో అపూర్వమైన గ్రంథం మీ ఇంట్లో వుంటుంది. మీ ఇంటికి ఎన్నో శుభాల్ని చేకూరుస్తుంది."

ఇటీవల వైధవ్యం ప్రాప్తించి, విషాదంలో వున్న జయలక్ష్మీదేవి అన్నయ్యకేసి ఆదరకంగా చూసింది.

"తీసుకో, ఇంట్లో వుండాల్సిన పుస్తకం" అన్నాడు ఆధ్యాత్మిక చింతన గల లక్ష్మీనారాయణ.

మారు మాట్లాడకుండా గదిలోకి వెళ్ళి పాతిక రూపాయిలు తెచ్చి, గోవిందరావుకు ఇచ్చింది జయలక్ష్మీ దేవి.

అప్పటికే రశీదు రాసి, చించి ఆవిడకు ఇచ్చాడు గోవిందరావు. ఇద్దరికీ వొంగివొంగి నమస్కారాలు చేసి, సత్వరమే నిష్క్రమించాడు గోవిందరావు.

ఆ తర్వాత, పది నిముషాలకు పక్కవీధిలోని సుబ్బ రామయ్య ఇంటికి వెళ్ళాడు గోవిందరావు.

దట్టమైన మబ్బులతో మసగ్గానే వుందిగానీ, వర్షం కురవడం లేదు.

సుబ్బరామయ్య ఒక ప్రభుత్వ డిగ్రీ కాలేజీకి అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసరుగా చేస్తూ యాభై అయిదేళ్ళ రిటైర్‌మెంట్ రూల్ కింద రిటైర్ అయ్యాడు. అయితే పాలల్లో నీళ్ళు కలిపే విధానం తెలియని అమాయిక ప్రభుత్వోద్యోగి అయిన ఆయన రిటైర్ అయ్యేనాటికి పెన్షన్ డబ్బులు తప్ప వెనకవేసింది అయిదు వేలు కూడా లేవు. ఇంకా ఇద్దరాడపిల్లలకు పెళ్ళిళ్ళు చేయాలి. ఎం.ఏ. చదువుతూన్న రెండో కొడుక్కి నెలకు మూడొందలు పంపించాలి. భార్య ఉబ్బసపు వ్యాధి గ్రస్తురాలు. చీకటి గదిలో నల్లపిల్లి తిరుగాడే భవిష్యత్తులో ఎవరో అగ్గిపుల్ల వెలిగించినట్టు సుప్రీం కోర్టు వారి తీర్పుతో మళ్ళీ ఆయనకు ఉద్యోగమొచ్చింది. ఆ సంతోషంతో ఏడుకొండల వాడికి ముడుపు కట్టిన శుభ సమయంలో గోవిందరావు తటస్థపడ్డాడు. గోవిందరావు వాక్చాతుర్యానికి ఉబ్బితబ్బిబ్బు అయి, 'భగవద్గీత' కోసం

మొదటి వాయిదా సొమ్ముగా పాతికె రూపాయిలు ముద్ర సుద్దిగా చెల్లించి రసీదు పుచ్చుకుని, పర్సులో భద్రపర్చుకున్నాడు.

పావుగంట పిమ్మట గాంధీనగర్‌లో ఓ పెద్ద మేడలోకి ప్రవేశించాడు గోవిందరావు. ఆ పెద్దమేడ కుటుంబరావుది. ఆయన కలపవ్యాపారంలో లక్షలకు లక్షలు ఆర్జించి, గత ఎలక్షన్లో అధికార పార్టీ తరుపున ఎం.ఎల్.ఎ.గా నెగ్గాడు. అయితే, ఆయన మీద కొన్ని అవినీతి ఆరోపణలు ఉండడంవల్ల, రాబోయే ఎన్నికల్లో పార్టీ తరుపున టిక్కెట్టు లభించలేదు. పైపెచ్చు వ్యాపారంలో ప్రత్యర్థికి టిక్కెట్టు దొరికింది. ఆయన ఆ దుఃఖోన్మాదంలో వుండగా, గోవిందరావు వల్లని మేఘంలా ఆయన్ను ఆవరించి, ఊరడింపు కబుర్లు చెప్పి, ఆయన దుఃఖోపశమనానికీ, వచ్చేసారి అయినా పార్టీ టికెట్ లభించడానికైనా 'భగవద్గీత'యే శరణ్యమని చెప్పి, మొదటి వాయిదా పాతిక రూపాయిలు పుచ్చుకున్నాడు గోవిందరావు.


సాయంత్రం మూడైంది.


ఆకాశంలో మబ్బులు హడావుడిగానే పచారు చేస్తున్నాయి. అయితే, గాలి తోడు కాకపోవడంతో వాన పడడంలేదు.

విజయవాడ బస్‌స్టాండ్ కొచ్చాడు గోవిందరావు. మచిలీపట్నానికి టిక్కెట్టు కొన్నాడు. ఇంకా బస్ లైన్‌లోకి రాలేదు. ఎదురుగ్గా వున్న షెడ్డులో రాతి బెంచీ మీద కూర్చున్నాడు. బస్ రావడానికి ఇంకా పది నిమిషాల టైం వుంది. ఓ సిగిరెట్టు వెలిగించాడు. ఎదురుగ్గా చంకలో మ్యాగజైన్లు పెట్టుకుని ఓ కుర్రాడు వచ్చాడు. "సార్... లేటెస్ట్ మ్యాగజైన్లు, వీక్లీస్, మంత్లీస్, సినిమా పత్రికలు, సెక్స్‌పుస్తకాలు, డిటెక్టివ్ నావల్స్, పొలిటిక్స్..."

వొద్దన్నట్టు ఎడం చేయి వూపాడు గోవిందరావు. ఆ కుర్రాడు బిక్కమొహం వేసుకుని, అవతల కాలేజ్ స్టూడెంట్స్ దగ్గరికెళ్లాడు.

...ఆ కుర్రాడూ పుస్తకాలతో వ్యాపారం చేస్తున్నాడు... తనూ చేస్తున్నాడు. కాని వాడిది నీతీ, నిజాయితీతో కూడుకున్న వ్యాపారం. కాని, తనదీ.. మోసంతో కూడుకున్నది. విజయవాడలో ఇవాళ తాను పదిహేను ఆర్డర్లు బుక్‌చేశాడు. ఒక్కొక్క దానికి పాతిక రూపాయిలు. రెండో వాయిదాకోసం మళ్ళీ తాను వాళ్ళ గడపలు తొక్కేదిలేదు. భగవద్గీతలు ఇచ్చేది లేదు. ఇట్లా హైదరాబాద్, వరంగల్, నిజామాబాద్, కరీంనగర్, కర్నూలు, కడప, నెల్లూరు, తిరుపతి, చిత్తూరు, మదనపల్లి, తెనాలి, గుంటూరు, ఏలూరు, రాజమండ్రి, విశాఖపట్నం...... ఎన్నో పట్టణాల్లో ఆర్డర్లు బుక్‌చేశాడు. ఎవ్వరికీ ఒక్క కాపీ ఇవ్వలేదు. తాను ఈ విధంగా భగవద్గీత భక్తుల్ని ఎంతకాలం మోసం చేయగలడు? ......ఈ వ్యాపారాన్ని వొదిలేయాలి సాధ్యమైనంత త్వరలో. దేవాధి దేవుడైన శ్రీకృష్ణ పరమాత్మ, గీతపేరు చెప్పగానే ఏ మాత్రం ఆధ్యాత్మిక దృష్టి గలవారు కూడా ఇట్టే లొంగిపోతారు. ఆ బలహీనతన్ని తాను వ్యాపారం కింద మార్చుకోవడం......తనని భగవంతుడు కూడా క్షమించడు. మరో వ్యాపారాన్ని, జీవన





'దీపకన్య'

చిత్రం: ఎ. ఉమ, కాశీబుగ్గ

విధానాన్ని మానుకోవడం మంచిది... గోవిందరావు అట్లా ఆత్మ విమర్శ చేసుకొంటూ వుండగానే బందరు వెళ్ళే బస్సు వచ్చి ఆగింది.

వెంటనే గోవిందరావు బ్రీఫ్‌కేసు తీసుకొని బస్సులో ఎక్కి కూర్చున్నాడు రెండో వరస సీట్లో.

మూడు గంటల తర్వాత నిముషాలకు బస్ బయల్దేరింది. బస్‌లో ప్రయాణీకులు నిండుగా వున్నారు.

బస్ బెంజిలారీ సెంటరు దాటుతుండగా "ఏమండోయ్ గోవిందరావుగారూ!" అంటూ వెనక నుంచి ఓ కేక వినిపించింది.

—ఏదో ఆలోచనలో వున్న గోవిందరావు ఉలిక్కిపడ్డాడు.

"నేను సోమయాజుల్ని. ఏలూరు, రామచంద్రరావు పేట. నాలుగునెల్ల క్రితం మా ఇంటికొచ్చారు. 'భగవద్గీత' కోసం పాతిక రూపాయిలిచ్చాను. వచ్చే నెలలో పుస్తకమిస్తానన్నారు. మళ్ళీ కంటికి కనబడలేదు. ఇదేం బావుండలేదు" అన్నాడు అరవైయేళ్ళ వయస్సులో వున్న సోమయాజులు దూకుడుగా. పొట్టిగా, బొద్దుగా, చిత్తూరు మామిడిపండు రంగులో, గ్లాస్కో ధోవతీ, లాంగ్‌క్లాథ్ లాల్చీ ధరించి, వయస్సుకు మించిన హుషారుగా వున్నాడు.

ఆయన్ను గుర్తుపట్టనట్టుగా నటించాడు గోవిందరావు.

సోమయాజులు బస్సు కడ్డీ పుచ్చుకు నిలబడ్డాడు. కూర్చోడానికి అక్కడ సీటు లేదు.

"ఏమయ్యా! అట్లా తెల్లమొహం వేసుకుచూస్తారేం! నన్ను గుర్తుపట్టలేదూ!"

నిజంగా గోవిందరావుకు గుర్తులేదు. కొన్ని వందల మంది దగ్గర 'గీత'కు ఆర్డర్లు బుక్ చేశాడు. మళ్ళీ వాళ్ళ మొహాలు ఎప్పుడూ చూడలేదు. ఎట్లాగుర్తుంటారు? సాధ్యమేనా అయినా గుర్తున్నట్టే నటించాడు గోవిందరావు.

"చూడండీ! సోమయాజులుగారూ! ఆ పుస్తకం పునర్ముద్రణలో వుంది. ఈ నెలాఖరుకు వస్తుంది. వచ్చే నెల తప్పకుండా మీ ఇంటికి తెచ్చియిస్తాను. మీ అడ్రస్ నా దగ్గరుంది" అన్నాడు గోవిందరావు ప్రతి మాలింపుగా.

"ఈ వేషాలు నా దగ్గర చెల్లుబడి కావయ్యోయ్! నిజం కోసం నిప్పుల్లో నిలబడేమనిషిని. ఎదుటి వాడు మోసం చేస్తే ముప్పతిప్పలూ పెట్టి మూడు చెరువుల నీళ్ళు తాగిస్తా. నా పట్టుదల అలాంటిది. పుస్తకం మర్యాదగా ఇవ్వు" అన్నాడు సోమయాజులు గొంతు ఆరున్నర శ్రుతికి హెచ్చించింది.

బస్సులో కూర్చున్న వాళ్ళు ఆ సంభాషణపై ఆసక్తిని కనబర్చసాగారు.

"ఇస్తానండీ - వచ్చే నెలలో"

ఆ సన్నాసేం వుడకదు. ఇప్పుడే కావాలి?"

"ఇప్పుడు నా దగ్గరెక్కడిది?"

...............

...............

బస్సు కంకిపాడు దాటేవరకూ వాళ్ళిద్దరి మధ్య వాగ్యుద్ధం జరుగుతూనే వుంది. తోటి ప్రయాణీకులు సోమయాజులు అవస్థచూసి, గోవిందరావు మొండివైఖరి గమనించి కూర్చోమని సలహాయిచ్చారు. అలసిపోయిన సోమయాజులు వెనకసీట్లో కెళ్ళి కూర్చున్నాడు. ఓ పట్టు నస్యం పట్టించాడు.

బస్సు వుయ్యూరు దాటింది.

'ఢాం' అని పెద్ద శబ్దమైంది.

—పిల్లలూ, స్త్రీలు, పురుషులూ... కేకలు, పెడబొబ్బలు...

ఎదురుగ్గా వస్తున్న ఇనుపఖనిజం లోడ్‌గల పెద్ద లారీని బస్ ఢీకొని, పది గజాల అవతల నేరేడు చెట్టుకు కొట్టుకుంది. బస్ బోల్తాపడింది.

...నేల మీద నెత్తురు మడుగు.

......హాహా కారాలు

నానా భీభత్సమైన దృశ్యం...

కాళ్ళుపోయిన వాళ్ళు, చేతులు విరిగినవాళ్ళు నడుంలు విరిగినవాళ్ళు, మొహాలు రూపుమారిన వాళ్ళు...

కొంతమంది ప్రయాణీకులు అక్కడికక్కడే చని పోయారు...

వెనక సీట్లల్లో కూర్చున్న వాళ్ళకు ఎక్కువ దెబ్బలు తగల్లేదు. ఇద్దరు ముగ్గురు అసలు చెక్కు చెదర్లేదు. వాళ్ళల్లో సోమయాజులు ఒకడు. రోడ్డు పక్కన నీళ్ళ గుంటలలో పడ్డాడతను. నెమ్మదిగా లేచి కట్టుపంచె చెంగుతో మొహం తుడుచుకుని గిలగిల్లాడే ప్రయాణీకుల దగ్గరకొచ్చాడు సోమయాజులు.

బస్‌లో పెట్టెలూ, మూటలూ, ఇతరత్రా సామాన్లు నలుమూలలకూ చెల్లాచెదురై పడివున్నాయి.

గోవిందరావు ఉలుకూ, పలుకూ లేకుండా చిల్ల కంపపొద పక్కన పడివున్నాడు. మెడా, మొహమూ, మదురూ రక్తమయమైవున్నాయి. 'పాపం! చనిపోయి వుండొచ్చు' అనుకున్నాడు సోమయాజులు.

గోవిందరావు శవానికి ఓ మీటరు దూరంలో అతని బ్రీఫ్‌కేసు విచ్చుకుని పడివుంది. అందులో 'భగవద్గీత' గ్రంథం నిశ్చలంగా వుంది — 'మానవుని బ్రతుకు నీటి బుడగలాంటిది' అన్నట్టు వీక్షిస్తూ.

సోమయాజులు బరువుగా వొంగి ఆ 'భగవద్గీత' పుస్తకం తీసుకొని, చంకన పెట్టుకొని, రోడ్డుమీద నిలబడ్డాడు.

పడమటి ఆకాశం నెత్తురు కక్కుతున్నట్టు నవ్వుతోంది!

"జాతస్యహి ధ్రువోమృత్యుః ధ్రువం జన్మమృతస్యచ
తస్మాదపరిహార్యేర్థే, నత్వం శోచితుమర్హసి"